క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి: పెరవలి సబ్‌స్టేషన్ పరిధిలోని ఖండవల్లి ఫీడర్‌పై విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎలక్ట్రికల్ డీఈ ఎస్ నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిట్టల వేమవరంలో కొత్త స్తంభాల ఏర్పాటు, నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు లాగేందుకు విద్యుత్ సరఫరాను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

వైభవంగా కడియాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కడియాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దాతలు

దేవరపల్లి: గ్రామ దేవత కడియాలమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. దేవరపల్లి–యర్నగూడెం జాతీయ రహదారిలో దేవరాచెరువు వద్ద ఉన్న పురాతన ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహాన్ని దాతలు గన్నమని కోనయ్య కుమారులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. శివ ఫంక్షన్ హాల్ అధినేత పసుపులేటి శివనాగ ప్రసాద్ దంపతులు చండీ హోమం, పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు



వేగేశ్వరపురంలో బోరు పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూస్ ఏఈ షేక్ నూర్జహాన్

తాళ్లపూడి: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా జెడ్పీ నిధులతో కొత్తగా మంచి నీటి బోర్లు వేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ షేక్ నూర్జహాన్ తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురంలో నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా జెడ్పీ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోరు పనులను సోమవారం ఏఈ నూర్జహాన్, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కైగాల శ్రీనివాస్, దేవన సత్తిబాబు తదితరులున్నారు.

పామాయిల్ చెట్లను స్వచ్ఛందంగా తొలగించండి

దేవరపల్లి: దేవరపల్లి విద్యుత్ సెక్షన్‌లోని రామన్నపాలెం, దేవరపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని పామాయిల్ చెట్లు, ఆకులు విద్యుత్ సరఫరాకు అటంకంగా ఉన్నందున రైతులు విద్యుత్ సిబ్బంది సహకారంతో స్వచ్ఛందంగా తొలగించాలని ఏఈ చిలకా వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై వేలాడడం వల్ల ప్రమాదకరంగా ఉన్నాయని ఆయన తెలిపారు. వీటిని తొలగించకపోవడం వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో సబ్‌స్టేషన్లలోని బ్రేకర్లపై భారం పడి పాడైపోతున్నాయని ఆయన తెలిపారు. లైన్లకు అతి దగ్గరలో ఉన్న చెట్లను పూర్తిగా తొలగించాలని ఆయన కోరారు. వేసవిలో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున తరచూ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు ఆయన తెలిపారు.

విశ్వగురువు మోదీ



ఎమ్మెల్యే మద్దిపాటితో పర్యటిస్తున్న పురందేశ్వరి

నల్లజర్ల: భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా పేదరికం నుంచి ప్రజల్ని విముక్తులను చేస్తున్న ప్రధాని మోదీ విశ్వగురువు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం నల్లజర్ల మండలంలో వివిధ గ్రామాలలో 8.65 కోట్లతో బీటీ రహదారులకు ఆమె ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. గోపాలపురం మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు ఇంటి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. ఆర్డీఓ సుస్మితారాణి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు పాల్గొన్నారు.

ఆగ్రో ప్రొడక్ట్స్ ఇండస్ట్రీ ప్రారంభం

కొవ్వూరు: ఐ.పంగిడి రెవెన్యూ పరిధిలో గోవర్ధనగిరి మెట్ట సమీపంలో నేషనల్ హైవే పక్కన నూతనంగా నిర్మించిన జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్లును సోమవారం ఎంపీ డి.పురందేశ్వరి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఆర్డీవో రాణి సుస్మిత, రైస్ మిల్లు ఎండీ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పొట్రు శ్రీనివాస్ పలువురు అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నీడ కరువు... బతుకు బరువు

- మండు టెండలో కూలీల అవస్థలు
- పని ప్రదేశంలో దాహం తీర్చుకునేందుకు నీళ్లు కరువు
- ప్రమాదానికి గురైతే మెడికల్ కిట్లు లేవు
- రూ.లక్షల మేర పేరుకుపోయిన వేతన బకాయిలు



కోరుమామిడిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



పందలపర్రులో ఉపాధి హామీ పనికి వెళ్లి ఎండలో వస్తున్న కూలీలు

నిడదవోలు రూరల్: మండే ఎండలను సైతం లెక్క చేయకుండా కుటుంబ పోషణ కోసం ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలను ప్రభుత్వం కల్పించలేకపోతోంది. ప్రస్తుతం సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం నుంచి మండుటెండలో తమ శ్రమను ధారపోస్తున్న కూలీలకు బతుకు భారంగా మారుతోంది. ఒక రోజు పనిచేస్తేనే మరుసటి రోజు పూట గడిచే ఉపాధిహామీ కూలీలకు 8 వారాలుగా వేతనాలు అందకపోవడంతో పస్తులుంటున్నారు. మండల పరిధిలో గతేడాది రూ.5.28 కోట్లు కూలీలకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.4.55 కోట్ల వేతనాలు చెల్లించారు. మిగిలిన రూ.73 లక్షల వరకు కూలీలకు వేతనాలు రూపంలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

డిమాండ్‌కు మేర పనికి రాని కూలీలు

నిడదవోలు మండలంలో 23 గ్రామాల పరిధిలో 8,636 జాబ్‌కార్డుల పరిధిలో 13,810 మంది కూలీలున్నారు. వీరిలో 9,061 మంది కూలీలు పనులకు వెళుతున్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎండలతో కూలీల డిమాండ్ మేరకు రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో అమలవుతున్న ఉపాధిహామీ పథకంలో పనిచేస్తూ పేద కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రస్తుతం రూ.307 వరకు వేతనం అందజేసే అవకాశం ఉండగా చేసిన పనిని బట్టి కొలతల ఆధారంగా వేతనాలు నిర్ధారించడంతో కూలీలకు రూ.230 మించి కూలి రావడం లేదు. ఈ పనులపై ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్న ఎన్నో కుటుంబాలకు రెండు నెలలుగా వేతనాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి ఇళ్లు గడుపుకోవాల్సిన దుస్థితి దాపురించిందని కూలీలు వాపోతున్నారు. ఎండల ప్రభావానికి ఉపాధిహామీ పనులకు కూలీల హాజరు శాతం తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆస్పత్రుల్లో అడిగి తెచ్చుకోవాలట

కూలీల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్న విషయమై ఉపాధి అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. తమకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, సరఫరా చేస్తున్నట్లుగా ఎటువంటి ఆదేశాలు లేవని వారంటున్నారు. కూలీలపై దయ తలచి ఏపీఓలు స్థానిక ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి డాక్టర్లతో మాట్లాడి ఓఆర్ఎస్ ప్యాకెట్లు తెచ్చుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నట్లు తెలుస్తోంది.

నీరు, నీడ కరువు

ఉపాధి కూలీలకు పనిచేసే చోట కూలీలకు సరైన వసతులు కనిపించడం లేదు. షామియానాలు, ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడంతో కూలీలు పని ప్రదేశాల్లో ఉన్న చెట్లు, పొదల కింద కూర్చొని సేద తీరుతున్నారు. కూలీలు భోజనం చేయాలంటే పని ప్రదేశాల్లోని చెట్ల నీడ ఆధారమవుతున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అస్వస్థతకు గురైన కూలీలకు తక్షణ ఉపశమనం కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్న ధ్యాస ఎక్కడా కానరావడం లేదు. ఒకవేళ వడదెబ్బకు గురైతే ఆ కూలీ కోలుకోవడానికి తీవ్రంగా వ్యయ ప్రయాసలు పడాల్సి ఉంటుందన్న విషయాన్ని అధికారులు విస్మరించారు.

> **పనులకు వెళ్తేనే పూట గడుస్తుంది**
>
> రెండు నెలలుగా ఉపాధి పథకం పనులకు సంబంధించి వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాం. ఎండల్లో పనిచేస్తుంటే ఒకవైపు ఆరోగ్యం క్షీణిస్తోంది. పొట్టకూటి కోసం శ్రమను నమ్ముకుని సాగుతున్నాం. వేతనాలు మంజూరు చేస్తే కూలీలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పని ప్రదేశాలు తాగునీరు, టెంట్‌లతో పాటు మెడికల్ కిట్లు అందజేయాలి.
>
> – ఆకుల వెంకటలక్ష్మి, ఉపాధి కూలీ, నిడదవోలు మండలం

దాళ్వా వరి కోతలు ప్రారంభం



ఉసులుమర్రులో యంత్రంతో వరి కోత



ఉసులుమర్రులో వరి కోత అనంతరం ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెడుతున్న రైతులు

పెరవలి: దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది నిడదవోలు నియోజకవర్గంలో వరి సాగు 36,500 ఎకరాల్లో చేపట్టగా పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో, ఉండ్రాజవరంలో 11,500, నిడదవోలు మండలంలో 16,500 ఎకరాల్లో చేపట్టగా ఇందులో విత్తన పంటగా సుమారు 2వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. ముందస్తుగా నాట్లువేసిన చేలు కోతలు చేపట్టారు. ఆలస్యంగా నాట్లు వేసిన చేలు కోతకు సిద్ధమవుతున్నాయి. విత్తన సాగుకి పేరెన్నికగన్న ఉసులుమర్రు, తీపర్రు, కానూరు అగ్రహారం, నడుపల్లి గ్రామాల్లో వరిచేలు కోతకు సిద్ధమయ్యాయి. వాతావరణం అనుకూలించటం వలన త్వరితగతిన ఈనికలు బాగుందని, తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉండటంతో పంట ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం తీపర్రు, ఉసులుమర్రులో వరికోత యంత్రాలతో కోతలు చేపట్టారు దీని వలన పంట తొందరగా ఒబ్బిడి చేయడంతో పాటు నిల్వ చేసుకోవటానికి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ప్రస్తుతం కోతలు చేపట్టిన చేల నుంచి ధాన్యాన్ని రోడ్డుపైకి తీసుకువచ్చి ఎండబెడుతున్నారు.

సాగులో ఖర్చులు ఆదా

యంత్రాల సాయంతో కోత కోయడంతో ధాన్యం ఎగరబోత, కుప్పనూర్పు వంటివి అవసరం లేకుండానే ఎప్పటికప్పుడు కోత కోసిన ధాన్యాన్ని గట్టుపైకి తీసుకువస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ఖర్చు తగ్గడంతో పాటు కోసిన పంట ఎప్పటికప్పుడు ఒబ్బిడి అవుతోందని కేవలం ఎకరం చేను గంట సమయంలో మాసూళ్లు పూర్తవుతున్నాయని రైతులు అంటున్నారు. శ్రమ, ఆందోళన లేకుండానే పంటలు ఒబ్బిడి అవుతున్నాయని అన్నదాతలు చెబుతున్నారు. కూలీలను పెట్టి కోతలు కోసి కట్టేత, కుప్ప నూర్పు, ధాన్యం ఎగరబోత వంటివి చేయవలసి వస్తుందని పెరిగిన కూలీ ధరల వలన వరి మాసూళ్లకే రూ.10వేల వరకు ఖర్చు అవుతుందని, సాగులో ఖర్చు తగ్గించడం కోసం వరి కోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నామని రైతులు వివరిస్తున్నారు. ఈవిధంగా చేయడం వలన ఎకరానికి రూ.3,500 వరకు ఖర్చు తగ్గుతుందని వారంటున్నారు. ప్రస్తుతం దిగుబడులు 50 నుంచి 55 బస్తాల వరకు రకాన్ని బట్టి వస్తోందని రైతులు జన్ని ఆంజనేయులు, వీరమళ్ల శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత



చాగల్లులో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న సమగ్ర శిక్షా జిల్లా అధికారి కనకబాబు, ఉపాధ్యాయులు

చాగల్లు: చాగల్లులో భవిత కేంద్రంలో సహాయకురాలు (ఆయా)గా పనిచేస్తున్న తొలిమి మరియమ్మ కుటుంబానికి ప్రత్యేక ఉపాధ్యాయులు రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మరియమ్మకు వికలాంగుడైన కుమారుడున్నాడు అతడు ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మరియమ్మది పేద కుటుంబం కావడంతో భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సహృదయంతో ఆమె కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ మొత్తాన్ని సోమవారం సమగ్ర శిక్షా జిల్లా అధికారి కనకబాబు చేతులు మీదుగా మరియమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కనకబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు రామచంద్రరావు, జి.నాగపూర్ణిమ, మండల విద్యాశాఖా కార్యాలయం సిబ్బంది గణేష్, వెంకట్, రాజేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలి



డ్రైనేజీలపై ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రోడ్ల విస్తరణకు అడ్డంకిగా ఉన్న డ్రైనేజీలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమిషనర్ కేతన్ గార్గ్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కోరుకొండ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. శాశ్వత ఆక్రమణలను గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. కోరుకొండ రోడ్డును 80 అడుగుల మేర పెంచేందుకు మార్కింగ్ చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను ఆకుపచ్చ గుడ్డతో మూసివేసేలా భవన నిర్మాణదారులకు తెలియజేయాలన్నారు.

9న ఎస్‌కేవీటీలో జాబ్‌మేళా

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి తెలిపారు. కళాశాలలోని వివేకవర్ధిని సెమినార్ హాల్లో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థులు హాజరుకావచ్చని, హెచ్‌ఆర్, సిస్టమ్ ఆపరేటర్స్, బీపీవో, మార్కెటింగ్, సేల్స్, సర్వీస్, అకౌంటింగ్, కౌన్సిలర్ తదితర ఉద్యోగాలు ఉంటాయన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలో దూకి రాజమహేంద్రవరానికి చెందిన సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి (54) సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డారు. మోటారు సైకిల్‌ను వంతెనపై విడిచిపెట్టిన అతడు నదిలో దూకారు. స్థానిక జాలర్ల సాయంతో గాలించగా రాత్రి మృతదేహం లభ్యమైంది. బోటు సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. రాజమహేంద్రవరంలో విద్యుత్ నగర్‌లో శ్రీనివాసరెడ్డి నివాసం ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య భువనేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగానే శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి పదేళ్ల కుమారుడు, భార్య ఉన్నారు.

పట్టణ ఎస్సైగా జగన్మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ



నిడదవోలు: నిడదవోలు పట్టణ ఎస్సైగా కె.జగన్మోహన్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కొవ్వూరు టౌన్ ఎస్సైగా పని చేస్తూ బదిలీపై నిడదవోలు వచ్చారు. ఐదేళ్లపాటు బొమ్మూరు ఎస్సైగా, రాజానగరం ఎస్సైగా ఆయన పనిచేశారు. పట్టణంలో శాంతిభద్రత పరిరక్షణే ధ్యేయంగా, వేసవిలో జరిగే దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా కన్నమాంబ పేరాంటాలమ్మ జాతర



అమ్మవారి ఘటాలను తీసుకువచ్చేందుకు వెళుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట నరసింహరావుపేటలోని కన్నమాంబ పేరాంటాలమ్మ 127వ జాతర సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా నరసింహారావుపేట నుంచి వాయిద్యాలతో వెళ్లి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న కన్నమాంబ పేరాంటాలమ్మ ఆలయం వద్ద పుట్టింగారం నుంచి ఘటాలను తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి నుంచి వీధులలో అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు శాంతి ర్యాలీ

కొవ్వూరు: గత నెల 24న అనుమానాస్పదంగా మృతి చెందిన క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాలకు సంతాపంగా ఈనెల 9న 9 గంటలకు కొవ్వూరు బహిరంగ సభ, భారీ ర్యాలీ నిర్వహిస్తామని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. సోమవారం పట్టణంలో క్రిస్టియన్‌పేటలోని ఇమ్మానియేలు ప్రార్థన మందిరంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ చర్చిలపై, క్రైస్తవులపై కొనసాగుతున్న దాడులకు నిరసనగా ఈ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. పి.రమేష్‌బాబు, బైబిల్ మిషన్ సేవకులు బి.షాలెం పీటర్, ఎస్.జాన్ అముస్టర్ తదితరులు పాల్గొన్నారు.

యువతుల అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు యువతులు అదృశ్యమైన సంఘటనపై సోమవారం కేసులు నమోదయ్యాయి. కోటిలింగాలపేటకు చెందిన యువతి గత నెల 30న తన స్నేహితులు ఇంటికి వెళ్లివస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్వారీ సెంటర్‌కు చెందిన యువతి ఈ నెల 5న డ్యూటీకి డీమార్ట్‌కు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

తాళ్లపూడి: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా తల్లీ పిల్లల ఆరోగ్యం, శ్రేయస్సుపై అధికారులు, ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి డాక్టర్ పి.అన్నపూర్ణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో పీహెచ్‌సీ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.సుచందన, ఆరోగ్య సిబ్బంది ఎస్.రమేష్, ఎమ్.వేదకుమారి, బి.కృపావరం పాల్గొన్నారు. అన్నదేవరపేట పీహెచ్‌సీ వద్ద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

పెరవలి: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని వైద్యులు హేమరాజు, పి తేజశ్రీ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పెరవలి, కానూరు పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓలు జయమణి, జి సత్యేంద్ర కుమార్, నాగేశ్వరరావు, ఆశా జ్యోతి, ప్రసాద్ పాల్గొన్నారు.



మలకపల్లి పీహెచ్‌సీ వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరంలో ర్యాలీ

ఉండ్రాజవరం: ఆరోగ్యకరమైన ప్రారంభం, ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో సోమవారం అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో మైలవరపు సుబ్రమణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిసెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పెరవలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గౌరీపట్నంలో..

దేవరపల్లి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని మండలంలోని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ జె.సందీప్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం ఆరోగ్యకరమైన ప్రారంభం–ఆశాజనక భవిష్యత్తు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎ.చిన్నికృష్ణుడు, ఎంపీహెచ్ఎస్ కెజేఎం జెస్సీ, ఎంఎస్‌వీ సత్యనారాయణ, సంధ్య, శాంతిశ్రీ, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేల వాలిన పంటలు



గజ్జరం వద్ద నేల వాలిన మొక్కజొన్న పైరు

తాళ్లపూడి: అకాల వర్షాలు, ఈదురు గాలులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాళ్లపూడి మండలంలోని తాళ్లపూడి, గజ్జరం, అన్నదేవరపేట, పోచవరం తదిర గ్రామాల్లో ఆదివారం వీచిన ఈదురు గాలులకు పలు చోట్ల పంటలు నేల వాలాయి. ముఖ్యంగా మొక్కజొన్న, అరటి, వరి చేలు నేలకొరిగాయి. దీంతో తీవ్రంగా నష్టపోయినట్టు రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న చేలు తయారు కాకుండానే నేల వాలడంతో ఎకరానికి రూ.15 వేల వరకు నష్టపోతున్నట్టు గజ్జరానికి చెందిన పెనుగొండ సతీష్ తెలిపారు. అరటి గెలలు తయారు కాకుండానే చెట్లు విరిగిపడిపోయాయి. మామిడి కాయలు తయారు కాకుండా రాలిపోయాయి. మండలంలో రబీ వరి కోతలు ముమ్మరంగా చేపట్టాన్నారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు చోట్ల కోసిన రబీ ధాన్యాన్ని ఆరబోసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

రేషన్ సక్రమంగా అందించాలి



గోపాలపురం ఎంఎస్ఎల్ పాయింట్‌లో సరకుల వివరాలు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

గోపాలపురం: ఎంఎస్ఎల్ పాయింట్ ద్వారా రేషన్ డీలర్లకు అందించే సరుకుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె. రాణి సుస్మిత అన్నారు. స్థానిక ఎంఎస్ఎల్ పాయింట్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ డీలర్లకు ప్రతి సరకూ తూకాలు వేసి అందజేయాలన్నారు. బియ్యం నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట గోపాలపురం తహసీల్దార్ కె.అజయ్‌బాబు, డీటీ సుందరం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం



నల్లజర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

నల్లజర్ల: ప్రజలందరికీ ఆరోగ్యం.. అదే ప్రపంచ ఆరోగ్య దినోత్సవ లక్ష్యమని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ మహమ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం నల్లజర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ, తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యం, వారి మనుగడ పెంపొందించడానికి వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రసూతి సమయంలో మాతా, శిశు మరణాలపై ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ నర్స్ సనమండ్ర సారమ్మ, ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చాగల్లు: ఊనగట్లలో మెయిన్‌రోడ్డులో పుంతలో ముసలమ్మ అనే కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు చిక్కం నర్సింహమూర్తి చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. నర్సింహమూర్తి తల్లి రామాయమ్మ జ్ఞాపకార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

మజ్జిగ పంపిణీ

చాగల్లు: మానవత సేవ సంస్థ ఆధ్వర్యంలో చాగల్లు కాకతీయ కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు గుంటూరుకు చెందిన కాటూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరి సహకారంతో వాహనదారులకు, స్థానికులకు మజ్జిగ పంపిణీ చేసినట్టు మానవత సేవ సంస్థ అధ్యక్షుడు జుజ్జవరపు ప్రసాద్ తెలిపారు.